
మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని ఇంట్లోనే అరెస్ట్ చేసిన పోలీసులు

# ఆంక్షలు.. అరెస్టులు

## సీఎం పర్యటన నేపథ్యంలో నిర్బంధకాండ

- విపక్ష నేతలకు పోలీసుల బెదిరింపు కాల్స్
- అర్ధరాత్రి నుంచి అరెస్టుల పర్వం..
- విపక్ష నేతలందరిపైనా నిఘా
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి అక్రమ అరెస్ట్
- నల్లగొండలో కంచర్ల, హైదరాబాద్‌లో కూసుకుంట్ల గృహ నిర్బంధం
- ఆలేరులో సునీతామహేందర్‌రెడ్డి దంపతుల హౌస్ అరెస్ట్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగిన అరెస్టులు, నిర్బంధాలు
- ట్రిపుల్ ఆర్, అదానీ సిమెంట్ బాధితులను వదలని వైనం
- రేవంత్ యాత్ర, మీటింగ్‌కు కాంగ్రెస్ శ్రేణులకే అనుమతి
- ఇదేం ప్రజాపాలన అని విపక్షాల నిలదీత

నల్లగొండ ప్రతినిధి, నవంబర్8(నమస్తే తెలంగాణ) : ప్రజా భాగస్వామ్యంతో మూసీ ప్రక్షాళనకు పూనుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న మాటలకు, ఆచరణకు పొంతన లేదని మరోసారి స్పష్టమైంది. శుక్రవారం వలిగొండలో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన మూసీ పునరుజ్జీవ సంకల్పయాత్ర అడుగడుగునా ఆంక్షలు, అరెస్టులు, తీవ్ర నిర్బంధాల నడుమ కొనసాగడమే అందుకు నిదర్శనం. రుణమాఫీ, రైతుభరోసా రాక, ధాన్యం కొనుగోళ్లు జరుగక రైతులు, అలైన్‌మెంట్ మార్పులు కోరుతున్న ట్రిపుల్ ఆర్ బాధితులు, దానీ సిమెంట్ కంపెనీని అనుమతులు ఇవ్వదంటూ రామన్నపేటవాసులు, ఆరు గ్యారెంటీల అమలులో నెలకొన్న వైఫల్యాలు... వెరసి ప్రజల నుంచి నిరసన వ్యక్తం అవుతుందన్న భయం అధికార పార్టీ నేతలను వెంటాడింది. దాంతో రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అడుగడుగునా పోలీసులను మోహరించి విపక్ష నేతలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించారు. మూసీ ప్రక్షాళనకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని చెప్తున్న ప్రభుత్వ పెద్దలకు ఇంత భయమెందుకుని విపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా పాలన అంటూనే ప్రజలను నిర్బంధించి కొద్దిమంది ఎంపిక చేసిన కాంగ్రెస్ శ్రేణులతో సంకల్పయాత్రను నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వలిగొండ మండలం సంగెం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన మూసీ యాత్రలో అడుగుడుగునా ఆంక్షలు కొనసాగాయి. మూసీ పరివాహక ప్రాంతాన్ని మొత్తం రెండు రోజుల కిందటే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ పరిసర గ్రామాల ప్రజలకు అనుమతి లేకుండా అక్కడికి రావద్దంటూ ముందే హెచ్చరికలు జారీ చేశారు. ఇక మూసీ నదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డులో రేవంత్‌రెడ్డి కొద్దిదూరం చేసిన పాదయాత్రలో సైతం కేవలం ముందస్తు అనుమతి ఉన్న నేతలను, కొద్దిమంది ఇతరులను మాత్రమే అనుమతించారు. మిగిలిన వారంతా సభాస్థలికే పరిమితం అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ మినహా మిగతా అన్ని పార్టీల, ప్రజాసంఘాల నేతలను, ముఖ్య కార్యకర్తలను ఎక్కడిక్కడ పోలీసులు నిర్బంధించారు. ఇంతటి నిర్బంధం నడుమ సాగిన యాత్రలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తన పుట్టిన రోజున మూసీ ప్రక్షాళన యాత్రను చేపట్టడంతో జన్మధన్యమైందని ప్రకటించడం పట్ల విస్మయం వ్యక్తమవుతున్నది.


మునుగోడు పోలీస్ స్టేషన్‌లో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ నాయకుల నిరసన


అరెస్టును నిరసిస్తూ కట్టంగూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి హౌస్ అరెస్ట్

### మాజీ ఎమ్మెల్యేల అరెస్టు...

నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై గురువారం సాయంత్రం నుంచే నిఘా పెట్టారు. లింగయ్య ముందు జాగ్రత్తగా మరోచోట ఉన్నా సెల్‌ఫోన్ సిగ్నల్ ట్రాకింగ్‌తో చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ముందు గృహ నిర్బంధం చేశారు. తర్వాత బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ వాహనాల్లో అటూ ఇటూ తిప్పుతూ చివరకు మునుగోడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల నిర్బంధాన్ని లింగయ్య తీవ్రంగా ఖండించారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని కొత్తపేటలోని నివాసంలో నిర్బంధించారు. ఆ తర్వాత చైతన్యపురి పీఎస్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని నల్లగొండలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సాయంత్రం వరకు ఆయన ఇంటి చుట్టూ పోలీసులు మోహరించారు. ఆలేరులో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతతోపాటు డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వీరితోపాటు కీలక నేతలందరినీ అదుపులోకి తీసుకున్నారు.

### అర్ధరాత్రి నుంచే..

రేవంత్‌రెడ్డి పర్యటనకు ప్రజల నుంచి నిరసనల సెగలు, నిలదీతలు తప్పవని భావించిన జిల్లాకు చెందిన మంత్రులు, కీలక ప్రజాప్రతినిధులు పోలీసులను రంగంలోకి దింపారు. గురువారం సాయంత్రం నుంచే యాదాద్రి భువనగిరి జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లోని విపక్ష నేతలు, ముఖ్య కార్యకర్తలకు ఫోన్లలో బెదిరింపులు మొదలయ్యాయి. సీఎం మూసీ యాత్రపై ఆరా తీస్తూ తమకు లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే పోలీసులు బీఆర్‌ఎస్, బీజేపీ. సీపీఎం, సీపీఐ, పలు ప్రజాసంఘాల నేతలపై నిఘా పెట్టి అరెస్టుల పర్వానికి తెరలేపారు. ముఖ్యంగా భువనగిరి, ఆలేరు, నకిరేకల్, మునుగోడు, నల్లగొండ, తుంగతుర్తి నియోజకవర్గాల నాయకులపై కన్నేసి అదుపులోకి తీసుకోవడం మొదలుపెట్టారు. తెల్లవారే సరికి ఆయా ప్రాంతాల్లోని విపక్ష నేతలందరినీ పోలీస్ స్టేషన్లకు తరలించారు. రేవంత్‌రెడ్డి రాక నేపథ్యంలో అరెస్టు చేశామంటూ సాయంత్రం వరకు అక్కడే ఉంచారు.

### అనుమానం వచ్చిన ప్రతీ ఒక్కరినీ...

రేవంత్‌రెడ్డి పర్యటనకు నిరసన సెగ తగలకుండా అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరినీ అరెస్టు చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తున్న బాధితులను చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి ప్రాంతాల్లో పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. చౌటుప్పల్‌లో బీఆర్‌ఎస్, సీపీఎం నేతలను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఇక రామన్నపేట, కట్టంగూరు, నకిరేకల్, నార్కట్‌పల్లి, చిట్యాల, కేతేపల్లి, శాలిగౌరారం, తిప్పర్తి, చిట్యాలలో బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఆలేరులో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలను, బీబీనగర్‌లో బీఆర్‌ఎస్‌వీ, వలిగొండ, రాజపేటలో బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేశారు. పోచంపల్లిలో, బొమ్మలరామారం, మోత్కూరులో ఆత్మకూర్(ఎం).లో బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేశారు. యాదగిరిగుట్ట, ఆలేరులో బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ నేతల అరెస్టు చేశారు. ఇక వేర్వేరు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్‌వీ, ఎస్‌ఎఫ్‌ఐ, లంబాడీ హక్కుల పోరాట సమితి, ఇతర ప్రజాసంఘాల నేతలను సైతం అక్రమంగా అరెస్టు చేశారు.


పల్లె.. నా పల్లె వీడియో పాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

## కళాకారులకు తోడ్పాటునందిస్తా

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, నవంబర్ 8 : జిల్లాలోని కళాకారులకు తన తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. 'పల్లె నా పల్లె' మ్యూజిక్ వీడియో ఫస్ట్ లుక్‌ను శుక్రవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. వేములపల్ల మండలం మంగాపురం గ్రామానికి చెందిన జెర్రిపోతుల రవి ఈ పాట రాసి నిర్మించగా.. వీడియోకు విరాట పర్వం ఫేమ్ సురేశ్ బొబ్బిలి సంగీతం అందించారు. ఇమ్మడి అశోక్ పాడినట్లు రవి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్, ప్రొడక్షన్ డిజైనర్ రామిరెడ్డి, వెలిదండ, ప్రశాంత్, మౌనిక పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి మొండి చెయ్యి

## పర్యటనతో ఒరిగింది శూన్యం

- అన్నీ ఒట్టి మాటలే.. పైసా విదిల్చింది లేదు
- ఎక్కడా ప్రస్తావించని ఎన్నికల నాటి హామీలు
- ట్రిపుల్ ఆర్ బాధితుల ముచ్చటే లేదు
- ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏమామె?
- ఐటీ పార్కు, ఇండస్ట్రియల్ కారిడార్ల సంగతేంది?
- సాగునీటి ప్రాజెక్టులకు నిధుల ఊసేది?
- పెదవి విరుస్తున్న జిల్లా ప్రజలు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా ప్రజలకు ఒట్టి మాటలు చెప్పి జిల్లాకు ఏమీ ఇవ్వకుండా, కనీసం ప్రకటించకుండా మొండి చెయ్యి చూపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఊసే ఎత్తలేదు. ట్రిపుల్ ఆర్ బాధితుల ముచ్చటే తీయలేదు. ఆలేరు రెవెన్యూ డివిజన్, ఐటీ పార్కు, ఇండస్ట్రియల్ కారిడార్లను ప్రస్తావించలేదు. సాగు నీటి ప్రాజెక్టుకు నిధుల మాటే ఎత్తలేదు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించారు. అధికారంలోకి వస్తే అది చేస్తం.. ఇది చేస్తం.. అని అభ్యర్థులతో కలిసి వాగ్దానాలు చేశారు. ఇప్పుడు ఏడాది కావస్తున్నా హామీలు అమలు చేయడం లేదు. శుక్రవారం జిల్లాలో రోజంతా ముఖ్యమంత్రి కార్యక్రమాలు ఉండడంతో ఏమైనా హామీలు ప్రకటిస్తారేమోనని అంతా ఆశగా ఎదురుచూశారు. కానీ ఆశలు అడియాసలుగానే మిలిగిపోయాయి. జిల్లాకు ఏమీ ఇవ్వకుండా ఖాళీ చేతులతో వెళ్లిపోయారు. ఎన్నో సమస్యలు ఉన్నా పట్టించుకోలేదు. ఒక్క భీమలింగం అభివృద్ధి పనులకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

### ట్రిపుల్ ఆర్ బాధితుల మాటే లేదు..

భువనగిరి మండలంలోని రాయగిరి ట్రిపుల్ ఆర్ రైతుల ముచ్చటే సీఎం ఎత్తలేదు. రాయగిరి రైతులు ఇప్పటికే నాలుగు సార్లు భూములను కోల్పోయారు. ఈ దఫా భూములు ఇచ్చేది లేదని, అలైన్‌మెంట్ మార్చాలని ఏండ్లుగా ఆందోళన చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అలైన్‌మెంట్ మారుస్తామని ఆ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ మొదలుకొని.. తెలంగాణ కాంగ్రెస్ నేతలంతా హామీ ఇచ్చారు. తీరా ప్రభుత్వంలోకి వచ్చాక పట్టించుకోవడమే మానేశారు. ఇక రామన్నపేటలో అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు ప్రతిపాదనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను మాట్లాడకుండా రేవంత్‌రెడ్డి దాటవేశారు.

### ఎన్నో హామీలు.. అమలేది?

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అనేక హామీలు ఇచ్చారు. ఆలేరు రెవెన్యూ డివిజన్, బస్వాపూర్ రిజర్వాయర్‌కు నిధులు, గంధమల్ల ప్రాజెక్ట్, ఐటీ పార్క్, ఇండస్ట్రియల్ కారిడార్, భువనగిరిలో డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ మార్కెట్, భువనగిరి–చిట్యాల రోడ్డు విస్తరణ తదితర ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. రాచకొండ, కొలనుపాక భూదాన్‌పోచంపల్లి, భువనగిరి ఖిలా, యాదగిరిగుట్టను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. బునాదిగానీ, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వకు నిధులు రావాల్సి ఉంది. కనీసం స్థానిక ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని సీఎం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటే బాగుండేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.


## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కొప్పోలులో ఏఈఓ, పీఏసీఎస్ సీఈఓ, కేంద్రం ఇన్‌చార్జి సస్పెన్షన్


కొప్పోలులో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్ త్రిపాఠి

గుర్రంపోడ్, నవంబర్ 8 : తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యం తూకం వేయడం, నిర్ణీత తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని అలాగే ఉంచడం, అస్తవ్యస్తంగా రికార్డుల నిర్వహణ, ప్యాడీ క్లీనర్లను వినియోగించకపోవడం, ధాన్యం రవాణాలో జాప్యం చేయడంపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహ వ్యక్తం చేశారు. మండలంలోని కొప్పోలు, చామలేడు గ్రామాల్లో శుక్రవారం ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొప్పోలు కేంద్రంలో తూకం వేస్తున్న ధాన్యం కుప్పలో నుంచి ధాన్యాన్ని తీసుకుని తేమ శాతం పరిశీలించారు. తేమ శాతం 22 వరకు చూపడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి అధికారులను నిలదీశారు. తేమ శాతను స్వయంగా పరిశీలించాల్సిన ఏఈఓను కలెక్టర్ ప్రశ్నించగా తాను లేని సమయంలో తేమ తీశారనడంతో ఏఈఓ రామాంజనేయులను, పీఏసీఎస్ సీఈఓ సాయికుమార్, సెంటర్ ఇన్‌చార్జి ధర్మయ్యను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం రవాణాలో తీవ్ర జాప్యం జరుగుతుందని, కేంద్రం నిర్వాహకుల తీరుపై రైతులు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. సెంటర్‌ను మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తామని, పనితీరు మార్చుకోకపోతే కమీషన్ నిలిపివేస్తామని హెచ్చరించారు. చామలేడు కేంద్రంలోనూ ఇదే రకమైన లోపాలను గుర్తించిన కలెక్టర్ తాను మరోసారి వచ్చి పరిశీలిస్తానని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి వి. వెంకటేశ్వర్లు, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తాసీల్దార్ జి.కిరణ్ కుమార్, ఎంపీడీఓ మంజుల, వ్యవసాయాధికారి కె. మాధవరెడ్డి, సివిల్ సప్లయి గిర్దావర్ రావుల సైదయ్య తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు


రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు

నల్లగొండ రూరల్, నవంబర్ 8: ఈ నెల 11 నుంచి 13 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల (అండర్ -17 ) రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టును శుక్రవారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దగ్గుపాటి విమల ఎంపిక చేశారు. ఎంపిక కోసం ఉమ్మడి జిల్లా నుంచి 80 మంది క్రీడాకారిణిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మెర్సీ ప్రభావతి, రవీందర్, బోనగిరి శ్రీనివాసులు , గుండా శ్రీనివాస్, కవిత, ఇమామ్ కరీం, శంభులింగం, గఫార్ పాల్గొన్నారు.

# గుట్టకు నిధుల్లేవ్

- నిరాశ మిగిల్చిన సీఎం రేవంత్‌రెడ్డి
- కొండపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఓవర్ యాక్షన్
- పోలీసులు, నాయకులకు తోపులాట
- ఆంక్షలతో భక్తులకు ఇబ్బందులు

యాదగిరిగుట్ట, నవంబర్ 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దేవస్థానం అభివృద్ధికి నిధులేమీ మంజూరు చేయలేదు. పెండింగ్ పనుల పూర్తి, మౌలిక సదుపాయాల కల్పనకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా సాధారణ భక్తుడిలా వెనుదిరిగారు. కేవలం ట్రస్ట్ బోర్డు ఏర్పాటు, యాదాద్రి పేరు మార్పు ప్రకటనతో సరిపెట్టారు. శుక్రవారం తన జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యుల బృందం చతుర్వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి స్వామివారి మహాప్రసాదం, దేవదాయ, ధర్మదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ స్వామివారి పత్రిమను అందజేశారు. అద్దాల మండపంలో స్వామివారి పులిహోర, కట్టె పొంగళి, సీరా, లడ్డూ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రెండున్నర గంటలపాటు వైటీడీఏ అధికారులతో సమీక్ష జరిపారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9.20 గంటలకు సీఎం రావాల్సి ఉండగా 11.02 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకుని మధ్యాహ్నం 2.50 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. సుమారుగా నాలుగు గంటలపాటు యాదగిరిగుట్టలో పర్యటించిన రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులపై మాట మాత్రమైనా స్పందించకుండా పనులను వేగవంతం చేయాలని, యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మార్చాలని అధికారులను ఆదేశించి వెళ్లారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

సమీక్ష సమయంలో స్వామివారి ఆలయ పునర్నిర్మాణంలో కాంక్రీట్‌ను వినియోగించారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించగా.. వినియోగించ లేదని, బునాది నుంచే కృష్ణ శిలలతో నిర్మించామని వైటీడీఏ అధికారులు బదులిచ్చారు. దక్షిణ ప్రాంతంలో మాఢవీధుల్లో కుంగిన విషయంపై వివరణ కొరగా.. మాఢవీధులకు సంబంధించిన ఫ్లోరింగ్, ప్రాకారానికి సంబంధించి ఫ్లోరింగ్ వేరువేరుగా వేయడంతో ఈ రెండు దక్షిణ రాజగోపురం వద్ద కలుస్తాయని, రెండింటి మధ్యలో గ్యాప్ రావడంతో కొంచెం కుంగినట్లు కనిపిస్తుందని వివరించారు. దాంతో ఆలయానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2015లో ప్రారంభమైన ఆలయ పునర్నిర్మాణ పనులను వైటీడీఏ అధికారులు ప్రొజెక్టర్ సాయంతో ఒక్కొక్క కట్టడం గురించి విడమరిచి వివరించారు.

### రూ. 260 కోట్లు అవసరమైనా..

ప్రధానాలయం పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన నిధుల పెండింగ్‌లో ఉన్నాయని, రూ.100 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎంట్రీ ఫ్లై ఓవర్, దేవస్థానం బస్టాండ్, కొండ కింద గండి చెరువు సుందీకరణ, తెప్పోత్సవం పనులు పెండింగ్‌లో ఉన్నాయని, నిత్యాన్నదాన సత్రం, రహదారుల విస్తరణ, పార్కింగ్ పనులు నిలిచిపోయాయని వివరించారు. గతంలో భూసేకరణ చేపట్టిన 110 ఎకరాలకు రూ. 60 కోట్లు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందని చెప్పారు. వాటితోపాటు మరో రూ.100 కోట్లు మంజూరు చేస్తే పనులన్నీ పూర్తి చేయొచ్చని పేర్కొన్నారు. సుమారు రెండున్నర గంటలపాటు అన్నీ విన్న రేవంత్‌రెడ్డి.. పెండింగ్ పనులు పూర్తి చేయాలి.. కొండపైన భక్తుల నిద్రకు ఏర్పాటు చేయాలి.. బ్రహ్మోత్సవాల్లోపు విమాన గోపురం బంగారం తాపడం పనులు పూర్తి చేయాలి.. గో సంరక్షణకు ప్రత్యేక పాలసీని తీసుకురావాలని ఆదేశించారే తప్ప కనీసం తక్షణ నిధులు కింద ఒక్క రూపాయి కూడా ప్రకటించ లేదు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా గుట్ట అభివృద్ధిని పట్టించుకోకపోవడం, సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి రెండో పర్యటనలోనూ నిధులు ఇవ్వకపోవడంపై స్థానికులు, భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

### కాంగ్రెస్ నేతల హంగామా

కొండపైన కాంగ్రెస్ నాయకుల ఓవర్ యాక్షన్‌ను పార్టీ కార్యక్రమాన్ని తలపించింది. తూర్పు రాజగోపురం నుంచి సీఎం, మంత్రులు ఆలయంలోకి ప్రవేశించగా.. తామూ ఆలయం లోపలికి వెళ్తామంటూ ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. దాదాపు 200 మందికిపైగా కొండపైకి రాగా, కొందరు క్యూలైన్‌ను తన్నుకుంటూ ఆలయంలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో వెనుక ఉన్న రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తోపులాటలో చిక్కుకున్నారు. ఆఖరికి ఆమెను కూడా తోసుకుంటూ ముందుకు వెళ్లారు.


తూర్పు రాజగోపురం వద్ద ఆలయంలో పోలీసులకు తోసుకుంటూ వెళ్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

### గంటన్నర పాటు దర్శనాలు బంద్

సీఎం పర్యటన నేపథ్యంలో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు సర్వ దర్శనాలను నిలిపివేయగా, భక్తులు క్యూలైన్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. కొండపైకి ఉచిత బస్సులతోపాటు ద్విచక్ర వాహనాలు, కార్లను అనుమతివ్వలేదు. దాంతో భక్తులు కొండకింద నుంచి కాలినడక వెళ్లారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటలకు చేపట్టాల్సిన స్వామివారి ఆరగింపు సేవ మధ్యాహ్నం 12. 35 గంటలకు చేపట్టడం గమనార్హం.

### బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

యాదగిరిగుట్ట అభివృద్ధిపై ప్రత్యేక నిధుల కేటాయించని సీఎం తీరుకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పట్టణంలో ఫ్లకార్డులను ప్రదర్శించి నిరసన తెలిపారు. సీఎం కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయగా పట్టణ సీఐ రమేశ్ వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముఖ్యమంత్రి వెళ్లిన అనంతరం తిరిగి వదిలిపెట్టారు.